క్లుప్తంగా

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: స్పందన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం మండల స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. స్పందనలో 27 అర్జీలు వచ్చాయి. పదే పదే స్పందనకు రాకుండా వీటిని పరిష్కరించాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సీడీపీవో కె.మేరీ సువార్త, మున్సిపల్ కమిషనర్ కనకారావు, తహసీల్దార్ అన్నాజీరావు, హౌసింగ్ ఏఈ నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో సమావేశం

మాడుగుల: డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు ఆదేశాల మేరకు స్థానిక ఎంపీపీ చాంబర్‌లో మంగళవారం ఉదయం 9 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్టు వైస్ ఎంపీపీ రాజారామ్ తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు విధిగా హాజరు కావాలన్నారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

162 మందికి వైద్య పరీక్షలు

కె.కోటపాడు: ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా గొండుపాలెంలో సోమవారం 162 మందికి చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల వైద్య సేవలందించారు. 9 మంది ఇళ్లకు రోగులను పరీక్షించారు. అనంతరం హైస్కూల్ విద్యార్థులకు అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు ఆరోగ్య పరీక్షలతోపాటు జాగ్రత్తలను వివరించారు. హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రీసర్వేలో అభ్యంతరాల స్వీకరణ



గర్నికంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మహేశ్వరరావు

రావికమతం: సమగ్ర భూరీసర్వేలో లోటుపాట్లు ఉంటే తక్షణమే సరిచేస్తామని తహసీల్దార్ మహేశ్వరరావు తెలిపారు. గర్నికం, మత్స్యవానిపాలెం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు భూములకు హద్దులు చూపడమే కాకుండా రాళ్లు వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ రెండు గ్రామాల్లో ఇద్దరు రైతులు మాత్రమే ఆధార్ కార్డుల్లో తప్పులు దొర్లాయని ఫిర్యాదు చేయగా, సరిచేస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్‌లు కేశంశెట్టి రాము, మలిచెట్ల గణేష్, ఆర్ఐ చినబ్బాయి పాల్గొన్నారు.

ఒప్పంద ఉద్యోగుల నిరసన

నర్సీపట్నం: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ భోజన విరామ సమయంలో ఎంఈవో కార్యాలయం వద్ద సోమవారం ఏపీ విద్యాశాఖ సమగ్ర శిక్ష సొసైటీలో పని చేస్తున్న ఒప్పంద ఉద్యోగులు ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. క్రమబద్ధీకరించాలని నినాదాలు చేశారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే రెన్నెల్లుగా పెండింగ్ జీతాలు చెల్లించాలన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పూడి వెంకట్రావు మాట్లాడుతూ మినిమం టైం స్కేల్ అమలు చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలను కల్పించాలన్నారు. ఒప్పంద ఉద్యోగులు సతీష్, భవాని, దేవుళ్ల నాయుడు, లోకేశ్వరరావు, రామలక్ష్మి, పద్మ శ్రావణి పాల్గొన్నారు.

ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం

అనకాపల్లిటౌన్: కుట్టు, ఫ్యాషన్ డిజైనింగ్‌లో 40 రోజుల ఉచిత శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని స్కిల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర ఇన్‌చార్జి అమ్మాజీ సూచించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా శ్రీసత్యసాయిబాబా మందిరం వద్ద సోమవారం శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఇటువంటి శిక్షణలు ఎంతగానో దోహదపడతాయన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం

తొలి రోజు 56 మంది విద్యార్థుల గైర్హాజరు



కె.కోటపాడులో పది పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



మాడుగుల: ఒమ్మలి కేంద్రం వద్ద ఎస్ఐ దామోదరనాయుడుతో సిబ్బంది పర్యవేక్షణ



మాకవరపాలెంలో గదుల వివరాలు చూస్తున్న విద్యార్థులు



నర్సీపట్నం: గురుకుల విద్యార్థులకు మనోధైర్యాన్ని కల్పిస్తున్న ప్రిన్సిపల్ వెంకటరెడ్డి

చోడవరం రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటల నిర్దిష్ట సమయానికి ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఎస్ఎస్‌సీ బోర్డు స్పష్టం చేయడంతో ఆలోపే హాజరయ్యారు. చోడవరం మండలంలో ఆరు పరీక్ష కేంద్రాలకుగాను 1,217 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది. తొలిరోజు పరీక్షకు మొత్తమ్మీద ఐదుగురు గైర్హాజరయ్యారు. 1,212 మంది హాజరయ్యారు. చోడవరం పట్టణంలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రానికి 222 మందికిగాను 220 మంది మాత్రమే హాజరు కాగా, ఇద్దరు రాలేదు. సూర్య మహతి స్కూల్ పరీక్ష కేంద్రానికి 193 మందికి గాను 192 మంది హాజరై, ఒక్కరు రాలేదు. జెడ్పీ బాలికోన్నత పాఠశాల కేంద్రానికి 220 మంది, భాష్యం పాఠశాల పరీక్ష కేంద్రానికి 250 మంది నూరుశాతం హాజరయ్యారు. గోవాడ జెడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో 226 మందికిగాను 225 మంది, లక్కవరం జెడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రానికి 106 మందికిగాను 105 మంది హాజరయ్యారని ఎంఈవో ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తమ సిబ్బందితో ఆరు పరీక్షా కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

రావికమతం: మండల వ్యాప్తంగా అయిదు కేంద్రాల్లో 909 మంది విద్యార్థులకుగాను 898 మంది పరీక్షలు రాశారు. 11 మంది గైర్హాజరయ్యారు. రావికమతం గర్ల్స్ స్కూల్ కేంద్రంలో నల్గురు, మరుపాక మోడల్ స్కూల్‌లో ఇద్దరు, రావికమతం కేంద్రంలో ముగ్గురు, కొత్తకోటలో ఒక్కరు, దొండపూడి కేంద్రంలో ఒక్కరు గైర్హాజరయ్యారు. పరీక్షలకు ముందు పలువురు విద్యార్థులు ఆలయాల్లో పూజలు చేయించుకున్నారు. జెడ్.కొత్తపట్నానికి చెందిన దివ్యాంగ విద్యార్థి గొలగాన శ్రీనును కొత్తకోటలో పరీక్ష కేంద్రానికి అతని సోదరుడు వినయ్ ఎత్తుకుని తీసుకువచ్చాడు.

మండలం	విద్యార్థుల హాజరు	గైర్హాజరు
చోడవరం	1,212	5
రావికమతం	898	11
రోలుగుంట		
బుచ్చెయ్యపేట	535	5
దేవరాపలి	94	2
మాడుగుల	720	7
కె.కోటపాడు	523	5
చీడికాడ		
నర్సీపట్నం	2,069	10
మాకవరపాలెం	609	3
గొలుగొండ	577	2
నాతవరం	525	6



వడ్డాదిలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సచివాలయ పోలీసులు

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 200 మందికి 198 మంది, తెనుగుపూడి డాక్టరు బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 196 మందికి 196 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. తొలి రోజు అరగంట ముందుగా పరీక్ష కేంద్రాల వద్దకు తల్లిదండ్రుల సహాయంతో చేరుకోవడంతో సందడిగా నెలకొంది. నోటీస్ బోర్డుల్లో తమకు కేటాయించిన గదులను చూసుకుని గదుల్లోకి వెళ్లారు. దేవరాపల్లిలో పరీక్ష రాయడానికి తెనుగుపూడి గురుకులం విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేసింది.

మాడుగుల: స్థానిక ఆర్సీఎం బాలికోన్నత పాఠశాల, కేజేపురం, ఒమ్మలి, తాటిపర్తి, మాడుగుల బాలికోన్నత పాఠశాలలో సోమవారం పది పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. ఒమ్మలి జెడ్పీ హైస్కూల్‌లో ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 720 మంది విద్యార్థులు హాజరు కాగా, ఏడుగురు గైర్హాజరయ్యారని ఎంఈవో బి. దేముడమ్మ తెలిపారు.

కె.కోటపాడు: స్థానిక హైస్కూల్‌లో పది పబ్లిక్ పరీక్షలకు 180 మంది విద్యార్థులకుగాను 179 మంది హాజరయ్యారు. అయ్యన్న ఇంగ్లిష్ మీడియం కేంద్రంలో 198 మందికి 196, ఎ.కోడూరు హైస్కూల్‌లో 150 మందికి 148 మంది హాజరయ్యారు. ఆయా కేంద్రాల వద్ద 144వ సెక్షన్‌ను ఎస్ఐలు ఆర్.ధనుంజయ్, బి.రామకృష్ణ అమలు చేశారు.

మాకవరపాలెం: మండలంలోని తామరం కృపాకమల్, మాకవరపాలెంలో హైస్కూల్, మాంటిస్సోరీ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. మొదటి రోజున 612 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 609 మంది హాజరైనట్టు ఎంఈవో నరేష్ తెలిపారు.

గొలుగొండ: స్థానిక గురుకుల కళాశాల, చీడిగుమ్మల, ఏఎల్‌పురం జెడ్పీ హైస్కూల్ కేంద్రాల్లో పది పరీక్షలు ప్రారంభయ్యాయి. ఈ మూడు కేంద్రాల్లో 579 మందికిగాను 577 మంది హాజరైనట్లు ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. మాస్‌కాపీయింగ్ జరగకుండా గొలుగొండ, కృష్ణదేవిపేట ఎస్ఐలు నారాయణరావు, సూర్యనారాయణ అన్ని చర్యలు తీసుకున్నారు.

నర్సీపట్నం: పట్టణంతోపాటు రూరల్ మండలంలోని తొమ్మిది కేంద్రాల్లో 2,079 మంది విద్యార్థులకుగాను 2,069 మంది హాజరయ్యారని ఎంఈవో సాయి శైలజ తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని విద్యాశాఖాధికారులు హెచ్చరించడంతో విద్యార్థులు గంట ముందుగానే చేరుకున్నారు. వీరు ముందుగా ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేయించుకుని పరీక్షా కేంద్రాలకు వెళ్లారు. బీసీ గురుకుల పాఠశాల నుంచి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు మనోధైర్యాన్ని నింపారు. ప్రత్యేక ఆర్టీసీ బస్సుల్లో ఆయా పరీక్షా కేంద్రాలను చేర్చారు.

నాతవరం: పదో తరగతి పరీక్షలు సమయంలో విధుల్లో లేని ఉపాధ్యాయులు, ఇతర వ్యక్తులు లోపలకు ప్రవేశిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ డి. లక్ష్మీనారాయణ హెచ్చరించారు. నాతవరం, డి.యర్రవరం హైస్కూళ్లలో పరీక్ష కేంద్రాల పరిసరాలను పరిశీలించారు. ఆయా కేంద్రాల వద్ద అల్లరిమూకలు అల్లర్లు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. మండలంలో 531 మంది విద్యార్థులకు గాను 6 గైర్హాజరయ్యారు.

బుచ్చెయ్యపేట: వడ్డాది జెడ్పీ హైస్కూల్‌పరీక్ష కేంద్రంలో 336 మందికిగాను 331 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఐదుగురు హాజరు కాలేదు. దిబ్బిడిలో 204 మందికిగాను 204 మంది హాజరైనట్లు ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు.



రావికమతం: కొత్తకోట సెంటర్ వద్ద తమకు కేటాయించిన గదులను చూసుకుంటున్న విద్యార్థులు



చోడవరం రూరల్: తమకు కేటాయించిన పరీక్ష గదుల వెదుకులాటలో విద్యార్థులు



దేవరాపల్లి: తెనుగుపూడి గురుకులం కేంద్రంలో విద్యార్థులు



నాతవరం: పరీక్ష కేంద్రం వద్ద ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ లక్ష్మీనారాయణ

గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభం



మాడుగులలో వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీపీ రామధర్మజ



ఉపాధి పనుల ప్రారంభోత్సవంలో సర్పంచ్ అప్పాజి

మాడుగుల రూరల్: అన్ని గ్రామాల్లో జాబుకార్డుదారులకు ఉపాధి పనులు కల్పించాలని ఎంపీపీ వేమవరపు రామధర్మజ తెలిపారు. స్థానిక పడాల చెరువు పూడికతీత పనులను ఆయన సోమవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. రూ.10 లక్షలతో పూడిక తీత, గట్లను పటిష్ట పర్చడం, తదితర పనులు చేయాలన్నారు. సర్పంచ్ యడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు పోలిమేర విజయలక్ష్మి, పోలిమేర చిన్నారావు, ఏపీవో వరహాలుబాబు, వీఆర్పీ పాపయ్యమ్మ పాల్గొన్నారు.

కె.కోటపాడు: ఆనందపురంలో ఉపాధి పనులను సోమవారం సర్పంచ్ వంటాకు అప్పాజి ప్రారంభించారు. ఇక్కడ మాకిరెడ్డి చెరువులో పూడికతీత పనులతోపాటు గట్టు పటిష్ఠతా పనులకు రూ.9.99 లక్షలు మంజూరైనట్టు వీఆర్పీ టి.నాగేష్ తెలిపారు. 125 మంది జాబ్‌కార్డుదారులకు వంద రోజుల పని కల్పిస్తామన్నారు. మాజీ సర్పంచ్ గురు బంగారునాయుడు పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత నివారణ



ప్రోత్సాహకాలు అందిస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, పీవో శ్రీగౌరి

నాతవరం: పౌష్టికాహారంతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. గొలుగొండ ఐసీడీఎస్ పీవో శ్రీగౌరి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా ఉత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. తక్కువ పెట్టుబడితో అధిక పోషకాలు ఉండే పండ్లు, చిరుధాన్యాలు, కాయకూరలు, వంటకాలు ప్రదర్శించారు. వీటిని పరిశీలించిన ఎంపీడీవో ఐసీడీఎస్ అధికారులను అభినందించారు, గర్భిణులకు, బాలింతలకు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో నాతవరం, గన్నవరం, వై.డి.పేట సెక్టార్ల సూపర్‌వైజర్లు ఎ.విజయలక్ష్మి, ఎ.నాగజ్యోతి, సత్యశ్రీ, నాతవరం ఎంపీటీసీ కరక రేణుక, ప్రాజెక్టు బీపీఏ కిరణ్‌కుమార్, కార్యకర్తలు వరలక్ష్మి, సత్యవతి, వసంత రాజేశ్వరి పాల్గొన్నారు.

వాహనచోదకులపై కేసుల నమోదు



కేసులు నమోదు చేస్తున్న ఎస్ఐ ఉమా మహేశ్వరరావు

రావికమతం: ఎస్ఐ ఉమామహేశ్వరరావు, సిబ్బంది సోమవారం రావికమతంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ -చలానా బకాయిలు, హెల్మెట్ లేని వారిని, మద్యం సేవించి బండి నడిపే వారిని తనిఖీ చేశారు. 20 మందిపై కేసులు నమోదు చేశారు. 20 వేలకుపైగా ఈ- చలానా బకాయిదారులు తక్షణం చెల్లించాలని హెచ్చరించారు.

ఉర్లోవ కొండపై క్వారీతో తీవ్ర నష్టం

- కొమిర రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న కొమిర రైతులు

రావికమతం: ఉర్లోవ కొండపై మైఖేల్ ఆంటోని గ్రానైట్ ఏర్పాటు చేయడం వల్ల తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని రైతులు కొమిర గ్రామ సచివాలయం వద్ద సోమవారం ఆందోళన చేశారు. మాడుగుల మండలం ఉర్లోవ కొండ సర్వే నంబరు1/12,1/14లో మైఖేల్ ఆంటోని కంపెనీకి గ్రానైట్ అనుమతులిచ్చారని, ఆ ప్రాంతానికి తమ భూములున్నాయని, దీనివల్ల సాగుకు నష్టం వాటిల్లుతుందని వాపోయారు. ఈ అంశాన్ని జిల్లా అధికారులు పరిగణనలోకి తీసుకుని గ్రామ సభ ఏర్పాటు చేసి న్యాయం చేయాలని రైతులు సోలాం లక్ష్మి, బురిగ సూకరత్నం, గిరిజన సంఘం నాయకుడు రాజీబాబు కోరారు.

వైద్యాధికారి వేధింపులపై ఫిర్యాదు

కె.కోటపాడు: లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్య సిబ్బందిపై వైద్యాధికారి శైలజ వేధింపులపై జిల్లా వైద్యాధికారి హేమంత్‌కుమార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు వైద్యులు చంద్రవదన, జాహ్నవి, హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు సోమవారం తెలిపారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్లను ఫీల్డ్ సిబ్బంది వద్ద చులకనగా చూస్తుండటం ఇబ్బందిగా ఉందని వాపోయారు. సిబ్బంది జీపీఎఫ్, ఇంక్రిమెంట్లకు దరఖాస్తులు చేసుకుంటే మామూళ్లు అడుగుతున్నారని ఆరోపించారు. ఇంకా పీహెచ్‌సీలో పలు అవకతవకలపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరామన్నారు. ఈ ఫిర్యాదుపై వైద్యాధికారి శైలజ మాట్లాడుతూ సిబ్బంది తనపై చేస్తున్న ఆరోపణలలో నిజం లేదన్నారు. కొత్త జీవో ప్రకారం క్లాస్ ఫోర్ నర్సులు మూడు షిఫ్టుల ప్రకారం పని చేయాలని, సమయానికి డ్యూటీకి రావాలని, విధులను సక్రమంగా నిర్వహించాలని, యూనిఫాం వేసుకోవాలని సూచించానన్నారు.

జూలై 31 వరకు కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు



కె.జె.పురంలో మాట్లాడుతున్న ఏడీ చిట్టినాయుడు

మాడుగుల రూరల్: జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో భాగంగా జూలై 31వ తేదీ వరకు ఉచితంగా కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్ వేస్తున్నామని మాడుగుల పశువైద్య శాఖ సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు తెలిపారు. సోమవారం కె.జె.పురంలో రైతులకు పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. రైతు భరోసా కేంద్రాల్లో పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రలు వద్ద ఇంజక్షన్లు ఉంటాయన్నారు. పశువులు అనారోగ్యానికి గురైతే 1962 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేయాలని సూచించారు. అనంతరం పశువైద్య సంచార వాహనంలో హైడ్రాలిక్ లిఫ్ట్ సహాయంతో పశువులు ట్రెవిస్‌ను ఉపయోగించి, 16 పశువులకు చూడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పశువైద్యాధికారి మణిలక్ష్మణ్, పశువైద్యశాఖ సహాయకుడు రమేష్ పాల్గొన్నారు.

ఆడపిల్లల ఆత్మరక్షణకు తైక్వాండో శిక్షణ



విద్యార్థినులకు తైక్వాండోలో శిక్షణ ఇస్తున్న కోచ్ మౌనిక

నర్సీపట్నం: విద్యార్థినుల ఆత్మరక్షణకు తైక్వాండో శిక్షణ ఎంతో దోహదపడుతుందని పేరెంట్స్ కమిటీ చైర్మన్ బేతిరెడ్డి విజయ్ అన్నారు. బండి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మార్షల్ ఆర్ట్ ఆధ్వర్యంలో పెద బొడ్డేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో తైక్వాండో శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్, సమగ్ర శిక్ష అభియాన్ సౌజన్యంతో శిక్షణ తరగతులు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఈ నెల 24 వరకు శిక్షణ ఇస్తామని నింజాస్ అకాడమీ ప్రతినిధులు తెలిపారు. నేషనల్ మెడలిస్టులు వేపాడ ప్రియాంక, బొంతు మౌనిక శిక్షణ ఇస్తారని స్పష్టం చేశారు. హెచ్ఎం పూడి అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో ఇంటింటికీ పింఛన్ల పంపిణీ



దిబ్బిడిలో వితంతు పింఛన్ అందిస్తున్న వలంటీర్ శేషు, సచివాలయ కన్వీనర్ రామారావు



వడ్డాదిలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న సచివాలయ కన్వీనర్ రాజా



వడ్డాది కొత్తూరులో వితంతు పింఛన్ అందిస్తున్న వలంటీరు మీనాక్షి

బుచ్చెయ్యపేట: మండలంలోని పలు గ్రామాల్లో పింఛన్ల పంపిణీ సోమవారం ప్రారంభమైంది. బ్యాంకులకు వరస సెలవులు రావడంతో ఒకటో తేదీన పింఛన్ల పంపిణీకి ఆటంకం ఏర్పడింది. ఈ నేపథ్యంలో సోమవారం అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసి వలంటీర్లకు అందించారు. మధ్యాహ్నం నుంచి ఇంటింటికీ వెళ్లి రాత్రి 10 గంటల వరకు సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. వరసగా ఐదు రోజుల పాటు వీటిని పంపిణీ చేస్తామని ఎంపీడీవో సువర్ణరాజు తెలిపారు.

సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లోకి..



లింగంపేటలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ గిరిబాబు



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ పైల సునీల్

గొలుగొండ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారని ఎంపీపీ గజ్జలపు మణికుమారి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు తెలిపారు. మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం చోద్యం, లింగంపేట, కొత్తమల్లంపేట, గొలుగొండ గ్రామ సచివాలయాల్లోని గృహ సారథుల సమావేశంలో వారు మాట్లాడారు. మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు కొరుప్రోలు పాణీశాంతారామ్, సర్పంచ్‌లు సంతోష్, కసిపల్లి బుజ్జి, రాజుబాబు పాల్గొన్నారు.

నాతవరం: ప్రతిపక్షాలు చేసే తప్పుడు ప్రచారాలను క్షేత్రస్థాయిలో తిప్పి కొట్టాలని వైస్ ఎంపీపీ పైల సునీల్ కోరారు. సోమవారం పి.కె.గూడెం, గుమ్మడిగొండ, చమ్మచింత, గునుపూడి గ్రామ సచివాలయాల్లో గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గణేష్ చెప్పిన ప్రతి అంశాన్ని తూచ తప్పకుండా పాటించాలని సూచించారు. వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, మండల కన్వీనర్ అడిగర్ల నాయుడు, పి.కె.గూడెం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి అచ్చెర్ల వరహాలబాబు, సర్పంచులు లగుడు నాగేశ్వరరావు, వేముల సూర్యనారాయణమూర్తి, వెలకాడ కొండబాబు, ఎంపీటీసీ సభ్యులు గాడి రమేష్, పోలుపర్తి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ముత్తా మహేష్, అప్పన దివాణం పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతి లబ్ధిదారుడికి వివరించాలని మండల సచివాలయాల కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. అవురువాడ పంచాయతీ పరిధిలో గ్రామ సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీటీసీ చదల కృష్ణందొర, నాయకులు బన్నీ, మాజీ సర్పంచ్ పాల్గొన్నారు. జాలంపల్లి, ఎల్. పోన్నవోలు, కింతలి, వల్లాపురం, తదితర గ్రామాల్లో ఈ సమావేశం నిర్వహించారు.

దేవరాపల్లి: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలతో మమేకమై సంక్షేమ పథకాల లబ్ధిని వివరించాలని జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ తెలిపారు. ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు అధ్యక్షతన తెనుగుపూడి గ్రామ సచివాలయం పరిధిలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సచివాలయ కన్వీనర్లు కిల్లాన శ్రీనివాసరావు, పెంటకోట శ్రీను, దాసరి దేముళ్లమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి గోవిందరావు, విస్సారపు అప్పారావు, బీమిన పోతురాజు, యాళ్ల దేముడుబాబు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు

అనకాపల్లిటౌన్: వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు యువత ముందుకు రావాలని ఎంపీ సత్యవతి పిలుపునిచ్చారు. తన కార్యాలయం ముందు సోమవారం చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులకు చలివేంద్రాలు దోహదపడతాయన్నారు.